

# టైగర్

c.s.రాయుడు

# ట్రైగర్

C.S.R. దేవాంగ
(C.S.రాయుడు)
csrayudu2014@gmail.com
csrdevanga@gmail.com

© C.S.Rayudu

గమనిక :

ఇందులోని కథ, సంభాషణలు, పాత్రలు, పాత్రల పేర్లు, ప్రతి ఒక్కటీ నవల కోసం ఊహించుకొన్న కల్పితమే ! ఎవ్వరినీ ఉద్దేశించినట్టివి కావని గమనించగలరు.

- C.S.Rayudu

నగర శివారు ప్రాంతమయిన శివాజీ నగర్....

చీకటి వెలుతుర్ను కసితో తరిమేస్తున్నట్టు కనుమరుగవుతున్నాయ్ ఆ సాయంత్రపు వెలుగులు.

సిటీ బస్సు వచ్చి ఆగింది. ఓ పదిమంది దాకా దిగారు ఆ ప్రాంతంలో.

ఆ పదిమందిలో ముగ్గురమ్మాయిలూ వున్నారు.

వారిలో అవంతి అనే అమ్మాయి తలవెంట్రుకలు చేత్తో సవరించుకుంటూ చుట్టూ పరికించి చూస్తోంది. మిగతా ఇద్దరు మోక్ష, చరితలు అవంతిని చూస్తున్నారు అమాయకంగా.

అది పారిశ్రామిక వాడ కావడం వల్ల జనసంచారం పెద్దగా లేదు. దూరంగా విసిరేసినట్టు కనిపిస్తున్నాయ్ నివాస గృహాలు కూడా.

" ఒసే అవంతి. ఈ ఏరియా ఏంటింత ఘోరంగా వుంది ? నీ ఆపరేషన్ కోసం ఎంతదూరం వెళ్ళాలి.?" అడిగింది చరిత వింతగా చూస్తూ.

అవంతి బదులివ్వలేదు. తమకు కాస్త దూరంగా వెళుతున్న ఓ వ్యక్తిని గమనించి దగ్గరగా వెళ్ళి " ఇక్కడ శివరంజని కన్‌స్ట్రక్షన్ వారు ఓ పెద్ద బిల్డింగ్ కడుతున్నారు. అదెక్కడో చెబుతారా ? ఆ బిల్డర్ పేరు చిదానందం" అడిగింది అవంతి హార్మోనియస్‌గా.

ఆ వ్యక్తి తన చూపుడువేలు చూపిస్తూ " ఇక్కడి నుండి రెండు ఫర్లాంగుల దూరం నడచి, తర్వాత కుడివైపు అర ఫర్లాంగు వెళితే కనిపిస్తుంది." చెప్పి వెళ్ళిపోయాడు.

దారి తెలిసిపోవడంతో సగం విజయం సాధించినట్టు సంబరపడింది అవంతి. " కమాన్ క్విక్... ఆ రాస్కెల్ తతంగం ఈరోజు మన కెమెరాలో చిక్కబోతోంది" రెట్టించిన ఉత్సాహంతో నడుస్తుండగా, ఆ ఇద్దరు మాత్రం భారంగా ఫాలో అవుతున్నారు.

"డ్రగ్స్ స్కాంను షూట్ చెయ్యటమంటే మనముండే సిటీలోనే ఓ బిల్డింగు చాటునుండి సీక్రెట్‌గా చెయ్యటం అనుకున్నాం. ఏదయినా ప్రమాదం వచ్చినా సెకెండ్స్‌లో పక్కకు వచ్చి తప్పించుకోవచ్చని గెస్ చేశాం. తీరా చూస్తే మనిషన్న వాడు కనిపించని డేంజర్ ప్లేస్‌కు తీసుకొచ్చావేంటే?" భయంతో కూడిన గొణుగుడు మొదలయింది మోక్షలో.

"అవునే. ఇంచుమించు నార్త్ ఇండియన్ హీరోయిన్లలా కనిపించే మనల్ను ఈ ఏకాంత ప్రదేశంలో ఏ బుద్ధిమంతుడు చూసినా బుద్ధిని అర్జెంటుగా మార్చుకొని భుజాన వేసుకొని వెళ్తాడు. నామాట విని వెనక్కి వెళ్దాం పదవే ..." రిక్వెస్ట్ చేసుకుంది చరిత కూడా.

వేగంగా నడుస్తున్న అవంతికి చిర్రెత్తిపోయింది. " సాహసం చెయ్యటం మాకూ ఇష్టమని చెబితేనే రమ్మన్నాను. రిస్క్ లేకుండా ఇలాంటి స్కాంలను చూడగలుగుతామా ? భయపడాల్సిన అవసరం లేదు. ఎంత రిస్క్ వచ్చినా నేను చూసుకుంటాను. ఆ చిదానందం చీకటి వ్యాపారం బయటికి తీయాలంటే ఈ రోజే ముఖ్యం.

ఇపుడు మనం వెనక్కి వెళితే కొత్తవ్యక్తులు వాడి గురించి ఎంక్వయిరీ చేస్తున్నారని సందేహం వస్తుంది. ఇంకోరోజు వచ్చే ఛాన్స్ కూడా వుండదు. నోర్మూసుకొని ఫాలో అవండి" రొప్పింది అవంతి తిరిగి ముందుకు నడుస్తూ.

ఆ ఇద్దరూ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తుండగా అవంతి మాత్రం జాబ్ కోసం ప్రయత్నం చేస్తోంది. అందరి దృష్టిలో ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తున్నదే గాని వాస్తవానికి మాత్రం సిటీలో

వెనుకున్న వారిలో.

వారికి సరిగ్గా ఓ వందడుగుల దూరంలో ఓ వెహికల్ వస్తుండగా ముగ్గురూ తలతిప్పి వెనక్కి చూశారు.

“ ఆ రెండు ఫర్లాంగుల దూరం వరకూ లిఫ్ట్ అడుగుదామా ?” అడిగింది చరిత వెంటనే.

“ వద్దు. బుద్ధిమంతుల్లా వున్నారు. అర్జెంటుగా బుద్ధి మార్చుకొని మనల్ను ఇంకెక్కడికో తీసుకెళ్తారు” అని మోక్ష అనగానే చరితకు చుర్రుమంది. “జోకులొద్దు. నవ్వేంత సీన్ లేదిపుడు” అంటూ అవంతి చేయి పట్టుకొని “అడుగుదామా?” రిక్వెస్టు చేసుకుంది.

ముగ్గురూ నిలబడ్డాక ఆ వెహికల్ కూడా ఆగిపోయిందక్కడే.

“ఇదేంటే … మనం నిలబడితే ఆ వెహికల్ కూడా ఆగిపోయింది? కొంపదీసి ఆ చిదానందం మనుషులా వీళ్ళు?” హీనస్వరంతో అడిగింది మోక్ష.

అవంతి సూటిగా గమనిస్తోంది అందులోని వ్యక్తులను.

వెహికల్ లోపల వున్న కాంతిలో కనిపిస్తున్నారామెకు.

“మైగాడ్… వీడా? వీడిపేరు ధనుష్. లాస్ట్ వీక్ అమ్మాయిలను ఓ చోట దర్జాగా ఏడిపిస్తుంటే వార్నింగ్ ఇచ్చాను. అయినా ఏ మాత్రం ఖాతరు చెయ్యలేదు. వెంటనే మహిళా పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసాను. పోలీసులొచ్చి తన్నుకొని తీసుకెళ్ళారు. ఆ కంప్లయింట్ ఇచ్చింది నేనేనని కనుక్కొని నన్ను గుర్తుపట్టి ఫాలో అవుతున్నారన్న మాట !” చెప్పింది అవంతి.

అవంతి చెప్పింది విన్నాక ఈడ్చి తన్నాలన్నంత కోపం వచ్చింది వాళ్ళకి.

“ఒసేయ్ నీయబ్బ… నిన్ను చేసుకోబోయే మేనత్త కొడుకు గురించి చెప్పినట్టు చావు కబురు ఎంత క్యూట్‌గా చెప్పావు? లోకంలో ఎంతమందే నీకు నలుగు పెట్టే చుట్టాలు ? అయినా నీకు ఇంత బ్యాక్ గ్రౌండ్ వున్నట్టు ఎపుడూ చెప్పి చావలేదే –” నిప్పులు చెరిగింది మోక్ష.

‘ నా చేతి నుండి ఎలా తప్పించుకుంటావే ’ అన్న భావంతో నవ్వుతూ చూస్తున్నాడు ధనుష్.

ఇంతలో కాస్త దూరంగా వున్న ఓ సందుగుండా ఓ ఆటో వెళ్తుండటం గమనించిన ముగ్గురూ కేకలు వేసుకుంటూ అటువైపు పరుగుదీశారు.

ఆటో ఆగింది వారి కేకలు విన్నట్టు. వడివడిగా వచ్చి కూర్చున్నారు ముగ్గురూ.

“చూడండమ్మా. ఎంత దగ్గర్లో దిగినా మినిమం యాభై అవుతుంది” ముందస్తు హెచ్చరికలా అన్నాడు డ్రైకర్ స్థిరమైన కంఠంతో.

“యాభై కాదు… వందిస్తాం. ముందు పోనివ్వు.” ఆయాసపడుతూ అంది మోక్ష.

ఆటో ముందుకు కదిలింది. వెనక్కి తిరిగి చూశారు ముగ్గురూ. ధనుష్ వెహికల్ వందడుగుల దూరంగా ఫాలో అవుతున్నది.

ఇక లాభం లేదు. ఆటో డ్రైవర్‌కు అసలు విషయం చెబితే తప్ప ఆ ధనుష్ నుండి తప్పించుకునే అవకాశం లేదనిపించింది.

“వెనుక కొంతమంది వెధవలు మమ్మల్ను ఫాలో అవుతున్నారు. ఎలాగయినా వాళ్ళ నుండి తప్పించుకునే ప్రయత్నం చెయ్యగలవా?” అర్థింపు కనిపించింది అవంతి గొంతులో.

పక్కనే వున్న మిర్రర్‌లో గమనించిన డ్రైవర్ “మీ పరిస్థితి అర్థమైంది. ఆ వెధవలనుండి మిమ్మల్ను

రక్షిస్తాను. నాకూ మీరో సహాయం చేస్తారా?" అడిగాడు వెంటనే

"సహాయమా?"

"అవును. నాకు అర్జెంటుగా వెయ్యి కావాలి. ఫైనాన్స్ వాడికి బాకీ వున్నాను. ఈరోజు కట్టకపోతే ఆటో తీసుకెళ్తానన్నాడు. కరెంటు పోయింది కదాని రూపాయి కొవ్వొత్తిని పదికి అమ్ముకునే రకం కాదు నేను. నా పరిస్థితి బాగోలేక అడుక్కుంటున్నాను" వేడుకోలుగా అడిగాడతడు.

ఇంకేం ఆలోచించక ముగ్గురూ ఒకేసారి సరేనన్నారు.

"వాళ్ళు కాదు. వాళ్ళను పుట్టించిన దేవుడు దిగొచ్చినా మీకేం కాదు." అంటూ రెట్టించిన ఉత్సాహంతో వేగం పెంచాడు డ్రైవర్.

వెనుక ధనుష్ వెహికల్ కూడా వేగం పుంజుకుంది. దాదాపు ఆటోను ఢీ కొట్టేంత చేరువలో వస్తోందిపుడు.

వెనుకవైపే గమనిస్తున్న ముగ్గురూ "కమాన్. ఫాస్ట్... ఫాస్ట్ " అంటూ భయంగా అరుస్తున్నారు.

కొన్ని క్షణాల తర్వాత డ్రైవర్ సడెన్ బ్రేక్ వేసినట్టు ఆపాడు ఆటోని. వెనుక ధనుష్ వెహికల్ కూడా అంతే సడెన్‌గా ఆగిపోయింది.

ముగ్గురికీ గుండెలదిరిపోయాయ్ ఈ పరిస్థితిని చూసి.

ఏమిటని వారు అడుగుదామనుకున్నంతలోనే ఆటో వేగాన్ని తిరిగి పెంచుతూ ఎడమవైపున్న సందులోకి మళ్ళించాడు డ్రైవర్.

అదే ప్రయత్నం చేయాలనుకున్న ధనుష్ వెహికల్ ఆ సందులోకి మళ్ళిస్తూ చప్పున ఆగిపోయిందక్కడే. ఎందుకంటే ఆటో మాత్రమే వెళ్ళగలిగేంత ఇరుగ్గా వుందారోడ్డు. ఇరువైపులా నాలుగైదు అడుగుల మేర దిగుడుగా వుంది.

"నేను వున్నట్టుండి ఇచ్చిన షాక్‌తో గిర్రున తిరిగి పడుకుంటారు కొడుకులు. ఇక్కడి నుండి అడ్డదారిలో మెయిన్ రోడ్డుకు మూడు నిముషాల్లో చేరుకుంటాం. ఈ లోపల మీరు పోలీసులకు ఫోన్ చెయ్యండి. రింగయ్యాక సెల్ నా చెవి దగ్గర పెడితే ఈ ఏరియా గురించి చెబుతాను. ఐదు నిముషాల్లో వచ్చేస్తారు."

గుండెలమీద చేతులేసుకొని హాయిగా వూపిరి తీసుకున్నారు వాళ్ళు. దేవుడే ఈ డ్రైవర్ రూపంలో వచ్చాడనిపిస్తున్నదిపుడు.

సెల్ ను హేండ్ బేగ్ నుండి బయటికి తీద్దామనుకునే వారి ప్రయత్నం ఫలించట్లేదు. ఎందుకంటే రోడ్డంతా ఎగుడు దిగుడుగా వుండటం వల్ల ఆటో అటూ ఇటూ వూగిపోతోంది.

ఆ సందు దాటాక ఓ మైదానం లాంటి ప్రదేశంలోకి వచ్చింది ఆటో. అక్కడంతా పనికిరాని మొక్కలు నేలంతా పరుచుకొని వున్నాయ్. ఆ ఏరియా బాగా పరిచయం వున్న వ్యక్తి కాబట్టి ఎంతో నేర్పుగా డ్రైవ్ చేస్తున్నాడతడు.

కాస్త దూరంలో కనబడింది ఓ గోడౌన్.

కొద్ది క్షణాల తర్వాత ఆటో సరాసరి ఆ గోడౌన్‌లోకి సర్రున వెళ్ళిపోయింది. ఆటో వెళ్ళగానే బయటున్న కాపలాదారుడు వెడల్పాటి కాంపౌండ్ గేటును మూసేశాడు. ముగ్గురూ ఆశ్చర్యంతో ఒకర్నొకరు చూసుకున్నంతలోనే జరిగిపోయింది ఇదంతా.

సుమారు వందడుగుల పొడవు, వెడల్పులతో కొలతలున్న ప్రదేశం అది. గోడలకు బదులుగా ఐరన్

పైపులు సపోర్ట్‌గా ఐరన్ షీట్లు చుట్టబడి వుందా నిర్మాణం. లోపలంతా ఎక్కువ భాగం పాత స్టీల్ సామాను అమర్చబడిన షెల్ఫ్‌లున్నాయి. పాత సామాను గోడౌన్ అని చూడగానే అర్థమవుతుంది.

డ్రైవర్ నింపాదిగా దిగి విషపునవ్వొకటి నవ్వుతూ “దొరసానులూ -- తమరు బస చేయాల్సిన రాజమందిరం వచ్చేసింది. కుడికాలు ముందు మోపి మెల్లిగా దిగండి” అంటూ అసలయిన విలన్ అవతారం చూపాడు.

ముగ్గురి గుండెలూ క్షణ కాలంలోనే బద్దలయినట్టు నిర్ఘాంతపోయారు. బేల చూపులతో కిందికి దిగారు అప్రయత్నంగానే.

ఇంతలో బయట ఓ వెహికల్ వచ్చి ఆగిన శబ్దం వచ్చింది. ఆ వెంటనే ధనుష్ అతని అనుచరులతో లోపలికి వచ్చాడు.

మరింత నిర్వికారంగా మారాయ్ వారి ముఖాలు. వాళ్ళను చూడగానే పామునుండి తప్పించుకునే ప్రయత్నం చేసిన కప్పలు చివరికి ఆ పాముల పుట్టలోకే వచ్చి ఇరుక్కున్నటుంది వారి పరిస్థితిపుడు.

వారికి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు ధనుష్. అతడి వెనుక నిల్చున్నారు అనుచరులు. మందు బాటిల్ ఓపెన్ చేసుకుని గ్లాసులో వేసుకుని నోటికి కరిపించాడు.

“ఒక్క దెబ్బకు రెండు పిట్టలంటారు.... కాని ఇదేంటి మూడు పిట్టలు పడ్డాయ్?” అని ధనుష్ వెటకారంగా అనగా వెనకున్న వారంతా విరగబడి నవ్వుతున్నారు.

మరింత కసిగా చూస్తున్న ధనుష్ “ఏమే... ఆరోజు ఎవరో అమ్మాయిని ఆటపట్టిస్తుంటే నీకేంటే నెప్పి? నన్ను అడ్డగించింది చాలక నాకు తెలియకుండా పోలీసులకు కంప్లయింట్ ఇస్తావా ?

అపుడక్కడ పాముతోకను తొక్కావు. ఇపుడిక్కడ దాని కాటుకు గురవుతున్నావ్. నీతో పాటు పాపం వీళు ళ్ళ కూడా ” పెద్దగా అరిచాడు.

తర్వాత జరిగే పరిణామం ఎంత ఘోరంగా వుంటుందో ఊహకువస్తోంది వారికి. ఒంట్లో నరాలన్నీ చిట్లిపోయేంత భయం ఆవహించింది. కొద్ది క్షణాల తర్వాత కళ్ళు తిరిగికింద పడబోతామన్న బేడ్ సెన్సేషన్ విషంలా ఒళ్ళంతా ఎగబాకుతున్నది.

మోక్ష, చరితలు వెక్కి వెక్కి ఏడ్వటం మొదలు పెట్టారు. ఇక అవంతి పరిస్థితి కూడా అలాగే వుంది. కాదంటే కాటేయబోతున్న పాము ఎదురుగా వున్నపుడు ఎంత ఏడ్చినా అది కాటు వేయక మానదు. అందుకే... వీలుంటే దాన్నుండి తప్పించుకునే ప్రయత్నం చివరి క్షణం వరకూ చేయాలన్నది ఆమె అభిమతం. ఇపుడు కూడా వీళ్ళందరినీ బురిడీ కొట్టించి ఎలాగయినా పారిపోవాలని శరవేగంగా ఆలోచిస్తోంది.

అంతవరకూ తల వంచుకున్న అవంతి లోపలున్న భయాన్ని ఎంతో బలవంతంగా పళ్ళబిగువున అదిమిపట్టింది. తర్వాత ఏం చెయ్యాలో తెలియదు గాని చాలా సీరియస్ గా తలెత్తి చూసింది వారిని. ఆమె చూపులో భయం లేదు. ఎదుటి వారి గుండెల్లో భయాన్ని సృష్టించే విల్ పవరుంది.

ఆమెను గమనించిన ధనుష్ ఆమె చూపుకందనంత గోప్యంగా ఓ ఉలికిపాటుకు గురయ్యాడు. “ఏంటే ఏడ్వకుండా అంత నిబ్బరంగా చూస్తున్నావు ? ఏదయినా అద్భుతం జరుగుతుందని భ్రమిస్తున్నావా ?” అవంతిగుండె నిబ్బరం వెనుకున్న కారణం తెలుసుకోవాలన్న ప్రయత్నం కనిపిస్తోందతని మాటల్లో.

ఏడుపులు ఆపి గుడ్లప్పగించి చూస్తున్నారామెను మిగతా ఇద్దరూ.

"అవును... అద్భుతమే జరుగుతుంది." అంది అవంతి అదే చూపు చూస్తూనే.

ఒకొర్నొకరు చూసువుంటున్నారు ఆమె మాట విని.

వారిలో ఓ భయాన్నయితే సృష్టించడంలో విజయం సాధించింది అవంతి. ఇదే భయాన్ని మరికొన్ని క్షణాలూ కంటిన్యూ చెయ్యగలదు... తర్వాతేం చెయ్యాలి?

గడచిపోతున్న క్షణాలు సూదుల్లా గుచ్చుకుంటున్నాయ్ ఆమెను.

లేచి నిలబడ్డ ధనుష్ కోపంగా చూస్తూ "ఏంటే డ్రామాలు ప్లే చేస్తున్నావా ?" అంటూ రెండడుగులు ముందుకేశాడు.

క్షణ ప్రాయంలోనే ఉలిక్కిపడ్డ అవంతి "స్టాప్ దేర్... డోన్ట్ మూవ్. ఇంకొక్క అడుగు ముందుకేస్తే అందరూ శవాలయిపోతారు. మీకు మీ ప్రాణాలు నిలవాలనుకుంటే అందరూ కిమ్మనకుండా పారిపోండి.పోండి... బ్రతికిపోండి" చివరి అవకాశం ఇస్తున్నట్టు చెయ్యి విదిలిస్తూ బిగ్గరగా అరిచింది.

మరో అడుగు ముందుకెయ్యబోయిన ధనుష్ చప్పున ఆగిపోయాడు.

నోటికి వచ్చినట్టు ఏదో మాట్లాడేసిన అవంతికి ఇపుడేం మాట్లాడాలో అంతుబట్టడం లేదు. తలను ఎంతమాత్రం తిప్పకుండా కళ్ళను మాత్రం అటూ ఇటూ వేగంగా తిప్పుతోంది పారిపోయే మార్గం ఏదయినా దొరుకుతుందేమోని.

లాభం లేదు. అలాంటి మార్గం చూచాయిగా కూడా కనిపించే అవకాశమే లేదక్కడ.

వెనుకున్న అనుచరులు ధనుష్‌ను చుట్టుకున్నారు. "అన్నా దీని ధైర్యం చూస్తుంటే నాకో అనుమానం వస్తోంది. దీని వెనుక ఆ టైగర్ గాడు వున్నాడేమో... లేకుంటే ఇంత తెంపుగా ఎలా మాట్లాడుతుంది?" మెల్లిగా చెవిలో చెప్పాడొకడు.

పిల్లి కళ్ళుమూసుకుని పాలు తాగుతూ తనను ఎవరూ చూడలేదనుకుంటుందట. అలాగే మందేసుకున్న ఈ మానవుడూ తను గోప్యంగా చెప్పాననుకుంటున్నాడు గాని ఎంతో నిశితంగా వారి మాటల్ను గమనిస్తున్న అవంతికి అతగాడి మాటలు లీలమాత్రంగా వినిపించాయ్.

ఇపుడు అసలయిన ధైర్యం వచ్చింది అవంతికి. ఇక చాలా సేపటి వరకూ బెదిరిస్తూ గేమ్స్ ఆడుకునే అవకాశాన్ని వాళ్ళే ఇచ్చినట్టుంది.

అసహనంతో రగిలిపోతున్నాడు ధనుష్. ఎవడు... ఎవడు వస్తాడే ఇక్కడికి? పెద్దగా అరుస్తూ అడిగాడు లోపలున్న భయాన్ని ఎంతమాత్రం చూపించకుండా.

అవంతి ఇపుడు మదింత స్వేచ్ఛగా నవ్వుతోంది.

ఆ నవ్వులో ఎంతో ధైర్యం వుంది. ఎదుటి వాళ్ళను గడ్డిపోచల్లా తీసి పడేస్తున్న నిర్లక్ష్యమూ వుంది.

డోలాయమానంలో పడిపోయాడు ధనుష్. తలకేసి బాదుకోవాలన్నంత పిచ్చి తలకెక్కేలా వుంది. ఇందాక టైగర్ గురించి చెప్పిన ఆ అనుచరుడ్ని తలతిప్పి చూస్తూ పళ్ళు కొరికాడు.

'ఒరే దరిద్రుడా మన చెప్పును మన చేతుల్తోనే దాని చేతికిచ్చి కొట్టమన్నట్టు చేశావు గదరా.. నీమాటలు గోప్యంగా విని డ్రామాలు చేస్తోందా? లేక నిజంగానే ఆ టైగర్‌గాడు దీని వెనుకున్నాడా ? ఏదీ తేల్చుకోలేకున్నాం' అంతర్గతంగానే రగిలిపోతున్నాడు.

వెంటనే ఆ అనుచరుడు ధనుష్ దగ్గరకు వచ్చి చెవి దగ్గర తల వాల్చి "అన్నా నేను చెప్పిందే

నిజమనిపిస్తున్నది గదూ ?" మేధావిలా ఫీలవుతూ అడిగాడు.

ఒంట్లో శక్తినంతా తన అరచేతిలోకి తెచ్చుకుని వాడి చెంపమీద ఒక్కటిచ్చాడు ధనుష్. కిందపడిపోయాడా మానవుడు.

ఇక ఉపేక్షించడం మంచిది కాదనుకున్న ధనుష్ వేగంగా వచ్చి అవంతి జుట్టు బలంగా పట్టుకున్నాడు. "ఎవడే... ఎవడొస్తాడే... ఎవ్వడో రమ్మను" బిగ్గరగా అరిచాడు.

అంత దురుసుగా పట్టుకోవడంతో అంతులేని బాధకు గురయింది అవంతి. పటపటమని పళ్ళుకొరుకుతూ "వస్తాడు. వాడే వస్తాడు. ఎవడి అడుగు పడితే ఈ నేల బద్దలవుతుందో, ఎవడి చూపు చూస్తే నిప్పురవ్వలు చిమ్ముతాయో, ఎవడి పంజా విసిరితే మీ రొమ్ములు చీలి గుండెలు బయటికొస్తాయో – వాడే...వాడే వస్తాడు" కేకలు పెట్టిందామె.

"ఎవ్వడే?" ఉన్మాదిలా అరిచాడు ధనుష్ ఆమె వెంట్రుకల్ను మరింత వడదిప్పుతూ.

ఇపుడయితే ప్రాణం పోతున్నట్టు విలవిల్లాడిపోతూ 'అమ్మా' అని అరవాలనిపించి అతి బలవంతంగా ఓర్చుకుని టై....గ...ర్ అని గొంతకింద నరాలు చిట్లేంత స్థాయిలో గావుకేక పెట్టిందామె.

మరుక్షణంలో అప్రయత్నంగానే ఆమె జుట్టును వదిలేసిన ధనుష్ బొమ్మలా నిల్చున్నాడలాగే. నోట మాట రావడం కాదు కనీసం శరీరంలో ఎలాంటి కదలిక చేద్దామన్నా అతని వల్ల కావడంలేదు.

అనుచరులంతా బెంబేలెత్తిపోయి చూస్తున్నారు. పిడుగుపాటు ఎటువైపు నుండి వచ్చి ఎవడి మీద పడుతుందో అర్థం కాక నలుమూలలూ బిత్తరపోయి చూస్తున్నారు.

తప్పించుకుని పారిపోవడానికి ఇదే అనువయిన తరుణమనుకున్న అవంతి ఆ ప్రయత్నంగా తన ఫ్రెండ్స్‌ను వేగంగా చూసింది.

మరొక్క క్షణం కూడా పూర్తవకముందే వున్నటుండి విన్పించింది ఓ పెద్ద శబ్దం ... అది మామూలు శబ్దం కాదు నిజంగా భూమి బద్దలవుతున్నట్టు, విన్న చెవులు గుయ్‌మనిపించేంత తీవ్రంగా వుంది.

ఏం జరిగిందో చూసేంతలోగా సైడునున్న ఓ ఐరన్ షీట్ పెనుగాలికి విసిరేయబడ్డ ఎండుటాకులా ఎగిరి వచ్చి పడగా, దాని వెనుకే సుమారు పదడుగుల ఎత్తులో రయ్యిమని ఓ బైక్ లోపలికి వేగంగా దూసుకొచ్చి, సమీపంలో వున్న ఓ షెల్ఫ్ ను ఢీ కొట్టింది. అందులోని స్టీలు సామాను విసిరేసినట్టు పడిపోవడంతో దుమ్మంతా నిండుకుందక్కడ.

పిడుగుపాటు లాంటి ఈ సంఘటనతో దిమ్మదిరిగిపోయింది వాళ్ళకి. స్విచ్ వేస్తే లైటు వెలిగినంత వేగంగా మత్తు దిగిపోయింది గుండెల్ను అరచేతిలో పెట్టుకొని వేగంగా బయటికి పరుగుదీశారు.

ఇక ఈ ముగ్గురూ శబ్దం రాగానే ఓ మూలకు ఒదిగి కూర్చున్నారు. కొన్ని క్షణాల తర్వాత దుమ్మంతా నేల దిగింది.

మెల్లిగా లేచి చూశారు ఆ అదృశ్య వ్యక్తిని. బోర్లా పడున్నాడతడు.

"ఇలాంటి ఆపదలో లక్షమార్లు మొరపెట్టుకున్నా ఆ దేవుడు కూడా ప్రత్యక్షం కాడేమో–– అలాంటిది టైగర్ అనగానే ఒక్క క్షణంలో వచ్చి వాలిపోయారు. నిజంగా ఎలా థేంక్స్ చెప్పాలో తెలియటం లేదు." అంతులేని ఆనందంలో అంది అవంతి. మిగతా ఇద్దరూ అంతకన్నా మరింత ఉప్పొంగిపోతూ చూస్తున్నారతన్ని.

ఇబ్బందిగా లేచి కూర్చున్న ఆ వ్యక్తి ఎంతమాత్రం స్పందించలేదు అవంతి మాటలకు.

అమాంతంగా వచ్చి పడటంతో శరీరంలో ఏ అవయవాలు దెబ్బతిన్నాయో అర్థం కాక ఒళ్ళంతా తడిమి తడిమి చూసుకుంటున్నాడు.

ముడిచిన మోకాలిపై చెయ్యి వేసుకుని తన అంతరాత్మతో తనే మాట్లాడటం మొదలు పెట్టాడు.

దీనెబ్బ ఎదవ జిందగీ... ఆ బుచ్చిబాబు వెండితెరమీద సూపర్‌స్టార్ అయిపోయి, షూటింగ్‌లో యాక్షన్ సీన్ కోసం డూప్ లేకుండా గాల్లో గిర్రున తిరుగుతూంటే, అది చూస్తున్న నా వీరాభిమానులు ఈలలు, చప్పట్లు కొడుతుండటం చూడాలని ఎన్నో కలలుగన్నాను. కాని ఓ కామెడీ హీరోలా ఇలా వచ్చి పడిచచ్చానేంటి ?

అతని మాటలు విన్న ముగ్గురూ విస్తుపోయారు. అవంతి వేగంగా ముందుకు వచ్చి “ఏంటీ... మీ పేరు బుచ్చిబాబా?.... అంటే మీరు టైగర్ కాదా? ” ప్రశ్నించింది.

అయోమయంగా చూశాడామెను. “టైగరా... టైగరేంటి? ఓ కాలంలో మన అన్నగారి సినిమా టైటిల్ అని తెలుసు నాకు” బదులిచ్చాడు అమాయకంగా.

బుచ్చిబాబు మాట తీరుతో అసహనానికి లోనయింది అవంతి. “నిజంగా మీరు టైగర్ కాకుంటే నేను ఆ పేరు పెట్టి అరవగానే ఈ విలన్లను ఫాలో అవుతున్న షాడోలా అంత వీరోచితంగా వచ్చి పడ్డారేంటి? మీరు కావాలని అబద్ధం చెబుతున్నారు. నిజంగా మీరు టైగరని మాకు తెలుసు” అని అవంతి అనగా పక్కనున్న ఆ ఇద్దరూ ఆమె మాటను సమర్థిస్తూ తలలూపుతున్నారు.

విభ్రమంగా చూస్తున్న బుచ్చిబాబు “అడవిలో తిరుగుతున్న జంతువు వున్నట్టుండి అబిడ్స్ రోడ్డు మీదికి వస్తే దాని జిందగీ ఎలా వుంటుందో అలా వుంది నా పరిస్థితిపుడు. ఇక్కడ మీ స్టోరీలో ఏం ట్విస్టులున్నాయో తెలీదు. నేను మాత్రం మీరనుకునే టైగర్‌ను ఎంతమాత్రం కాను.

సినిమాల్లో హీరోగా నటించి బంపర్ కలెక్షన్లతో ప్రస్తుత నిర్మాతలను రక్షించాలన్న ఆశయంతో వారం క్రితం ఈ సిటీకి వచ్చాను. మా ఫ్రెండు బైకు తీసుకొని అలా వచ్చాను. ఏదో నా దరిద్రం కొద్దీ పాడు ఎమోషన్‌తో స్పీడు పెంచాను. ఉన్నటుండి బ్రేక్ వైర్ తెగిచావడంతో ఏం చెయ్యాలో తెలియక ఈ గోడౌన్ ను ఢీ కొట్టి ఇలా పడిపోయాను.” వివరించి మరీ చెప్పాడు.

తిరిగి భయం వచ్చి చేరింది ముగ్గురి ముఖాల్లో అతని మాటలు విన్నాక.

మైగాడ్... మళ్ళీ డేంజర్ వచ్చి పడింది. ఇంకాసేపట్లో ఆ రౌడీ వెధవలు తిరిగి వస్తారు. వాళ్ళు శత్రువులా భావించే టైగర్ ఇతనేనని కాల్చిపడేసి, ఆ తర్వాత తమ పని చూస్తారు.

క్షణాలు... క్షణాల్లోనే ఏదోక వ్యూహం రచించాలి. ఏం చెయ్యాలి?

అవంతి మస్తిష్కం అతి వేగంగా ఆలోచన చేస్తోందిపుడు.

తర్వాత వెంటనే ఏదో ఆలోచన వచ్చి బుచ్చి బాబుకు ఎదురుగా మోకాళ్ళపై కూర్చుని ఇంతవరకూ జరిగిందంతా చాలా వేగంగా చెప్పింది.

విన్న బుచ్చిబాబు ముఖం ఆందోళనగా మారిపోయింది. “అంటే వాళ్ళు ఇపుడు లోపలికి వచ్చి నేనే టైగరనుకొని కాల్చిపడేస్తారన్నమాట.. వాళ్ళు లోపలికి రాగానే రెండు చేతులు పైకెత్తి వాళ్ళకు సరెండర్ అయిపోయినట్టు కనిపిస్తాను. నేను టైగర్‌ను కాదు మొర్రో అని గావుకేకలు పెడతాను. లేకుంటే దీనెబ్బ ఎదవ జిందగీ... వాళ్ళ చేతుల్లో అన్యాయంగా చస్తే – మన తెలుగు సినిమా పరిశ్రమ అనవసరంగా ఓ సూపర్‌స్టార్‌ను మిస్సవుతుంది. పాపం.. అసలే నష్టాల్లో మునిగిపోతున్న మన నిర్మాతలేం కావాలి?” తనదైన శైలిలో బాధపడుతూ

చెప్పాడు.

చరచరమని మండిపోయింది అవంతి మనసు అతడి మాటతీరు చూసి. ఇప్పటికిప్పుడే బుచ్చిబాబు జుట్టు పట్టుకొని ఈడ్చీడ్చి కొట్టాలన్నంత కోపం వస్తోంది. అతి భారంగా తమాయించుకొని "చూడు బుచ్చిబాబు-- నీకంత ఛాన్స్ వుండదు. వాళ్ళు ఆరితేరిన విలన్లు. దొంగచాటుగా వచ్చి కాల్చిపడేస్తారు. నీ చిత్రమైన ఆలోచన్లు పక్కన పెట్టి నేను చెప్పినట్టు చెయ్" అంటూ ఇంకేదో చెప్పబోతున్న అవంతికి అడ్డు తగిలిన బుచ్చిబాబు "ఇంకేం చెప్పాల్సిన అవసరం లేదు. నాకర్థమయింది. ప్రస్తుతానికి నేనే టైగర్ లా నటించాలి. వాళ్ళను ఏదోలా భయపడించి బురిడీ కొట్టించాలి. అలా చేస్తూ సందిట్లో సడేమియా అన్నట్టు నలుగురం ఇక్కడ్నుండి పారిపోవాలి. అంతేకదూ ?" చెప్పాడు వేగంగా. అవంతి విస్తుపోయి చూసిందతన్ని.

"అంత ఆశ్చర్యం అవసరం లేదు. ఈ మాత్రం తెలివిని ప్రదర్శించటానికి మన తెలుగు సినిమాలు చూసే అలవాటు చాలు. అది సరే... ఇదంతా చెయ్యటానికి నాకు ఇచ్చే రెమ్యునరేషన్ ఎంతో చెప్పు ముందు" స్థిరమైన అభిప్రాయాన్ని ఆమె ముందుంచాడు. ముగ్గురూ చిత్రంగా చూశారతన్ని.

"మీరు వినింది నిజమే-- ఈ పని చెయ్యటానికి నేను పొందే రెమ్యునరేషన్ ఎంతని అడిగాను" వత్తి పలికాడు నిస్సంకోచంగా.

"ఈ టైంలో రెమ్యునరేషన్ అడుగుతున్నావేంటి?" ఆశ్చర్యపోయింది అవంతి.

బుచ్చిబాబు మెల్లిగా నవ్వుతూ "రెమ్యునరేషన్ లేకుండా ఈ హీరో ఏపనీ చెయ్యడు" అని చెప్పాక - అతనితో వాదోపవాదాలకు ఇది సమయం కాదనుకున్న అవంతి "సరె. ఎంతో చెప్పు" వేగంగా అడిగింది.

"నీ మనసులో ఎంతివ్వాలనుందో ముందు చెప్పు. సరిపోతుందో లేదో నేను తర్వాత చెబుతా" అన్నాడతడు. ముందుగా లక్ష అనుకున్న అవంతి వెంటనే మనసు మార్చుకొని "ఓ పాతిక వేలు ఇవ్వగలం" అనగానే ఉలిక్కిపడ్డాడు బుచ్చిబాబు.

తన మనసులో ఓ పదివేలు డిమాండ్ చేసి ఆ తర్వాత ఏ ఏడో, ఎనిమిది వేలకో ఫిక్స్ చేద్దామనుకున్నాడు. పాతికవేలనగానే ఉప్పొంగిపోయాడు. "ఈ సమయంలో బేరసారాలొద్దు. నువ్వన్నట్టు దానికే ఫిక్సయ్యాను." అనేసి చుట్టూ పరికించి చూశాడు.

"ఇపుడు ఆ రౌడీలు లోపలికి రాగానే వాళ్ళను ముందుగా భయపెట్టి మాటల్లో దించుతాను. ఆ తర్వాత ఇక్కడ వెలుగుతున్న ఆ ఒక్క బల్బు ఫట్‌మని పగిలిపోతుంది. అపుడంతా చీకటి... ఆ చీకట్లో మీ ముగ్గురూ బయటికి పారిపోండి. నేను కాసేపు వాళ్ళకి దాగుడుమూతలు సినిమా చూపించి తర్వాత నేనూ బయటపడతాను" ఆరితేరిన వ్యూహకర్తలా వేగంగా వివరించి చెప్పగా ముగ్గురూ సరేనని తలూపారు.

వెంటనే మోక్షకు ఓ సందేహం వచ్చి బుచ్చిబాబుకు ఎదురుగా వచ్చి నిల్చుని అడిగింది. "అంతా బాగానే వుంది. కాని ఆ బల్బు ఎలా పగిలిపోతుంది?"

విసుగో, విరక్తో తెలీదుగాని అదోలా మారింది బుచ్చిబాబు ముఖం.

దీనెబ్బ... ఇలా తగలడతాయ్ ఆడ జిందగీలు. హీరో చేసే విన్యాసాలు ఆసక్తిగా చూడాలంతే. ఏం

జరుగుతుందీ, ఎలా జరుగుతుందీ... ఇలాంటివన్నీ అడక్కూడదు" అనేసి వెంటనే అవంతి వైపు చూసి ఆమె మెడలోని చున్నీ తీసుకొని మొహానికి ముసుగులా చుట్టుకున్నాడు.

అనుకున్నట్టుగానే ధనుష్ బృందం చేత గన్‌లు పట్టుకొని ఒకేసారి అందరూ గురిపెట్టారు బుచ్చిబాబును.

దూరం నుండే చాలా జాగ్రత్తగా గమనిస్తున్నారతన్ని.

ఇంతకాలం తమ పాలిట సింహస్వప్నంలా తయారయిన టైగర్ వీడా? ఈ రోజు మా చేతిలో చావు తప్పదు గాక తప్పదు. ఎంత మాత్రం జంకు లేకుండా చాలా తేలిగ్గా నిలబడి వున్న బుచ్చిబాబు వున్నటుండి బిగ్గరగా నవ్వాడు.

తర్వాత వారందరినీ తల తిప్పి చూస్తూ "గొర్రెలు ఎన్ని ఆయుధాలతో ఎన్ని విన్యాసాలు చేసినా బెదరదురా పులి... రాటుదేలిన ఈ గుండె ఎరగదురా గిలి" ప్రాసవాక్యాలను హీరోలా ఫోజిస్తూ పలికాడు.

ఓ మూలన నక్కి వున్న అవంతి ముఖం విసుగ్గా మారింది. ఈ మహానుభావుడ్ని భయపెట్టమంటే హీరోలా కనిపించాలని మరీ చిత్రంగా ప్రాసవాక్యాలు పలుకుతున్నాడేంటి ? ఈ మాటలకు వాళ్ళు బెదిరిపోతారా?

"రేయ్...టైగర్ అంటే ఏమిటో అనుకున్నాం. నిన్ను చంపడానికి ఎంతో రిస్క్ అవసరమనుకున్నాం. కాని ఇలా పిల్లిలా మాకు దొరికేస్తావని అనుకోలేదు. నువ్వు ధైర్యవంతుడిలా డైలాగులు చెబితే మనిషి అయితే భయపడతాడేమో గాని మా దగ్గరున్న గన్‌లు భయపడవు" గర్వంగా అన్నాడు ధనుష్.

"అరేయ్... మీరు వందమంది వచ్చినా నాకేం కాదు. చివరికి మీరంతా ఇక్కడే శవాలై పడటం ఖాయం. ఇంకొక్క విషయం చెబుతున్నా వినండి. ఈ టైగర్‌లో సాయి, కసాయి ఇద్దరూ వున్నారు. తోకముడిచి వెంటనే పారిపోతామంటే నాలో క్షమించే సాయి కనిపిస్తాడు. కాదంటే అడ్డంగా నరికే కసాయిని చూస్తారు" వాళ్ళకు మరో అవకాశం ఇస్తున్నట్టు చాలా కూల్‌గా చెప్పాడు బుచ్చిబాబు.

మరింత చుర్రుమంది వాళ్ళకు "ఏందన్నా ఈ కొడుకు చెప్పే సోది వినడం? కాల్చేద్దాం" అని ఒకడనగా అందరూ ఒకేసారి కాల్చాలని సిద్ధం అయిపోయారు.

ఎవ్వరికీ అనుమానం రాకుండా ఇప్పటివరకూ బుచ్చిబాబు వేసుకున్న స్కెచ్‌ను దాదాపు సిద్ధం చేసుకున్నాడు. తను వాళ్ళతో ఇంతవరకూ మాట్లాడుతూ వాళ్ళ దృష్టిని కేవలం తన ముఖం మీద పడేట్టు చేసి, మరో వైపు తన కుడి పాదాన్ని దగ్గర్లో వున్న ఓ పాత స్టీలు బిందెలోకి అమర్చుకున్నాడు గోప్యంగా. ఇక ఆలస్యం చెయ్యకుండా ఒకే ఉదుటున దాన్ని పాదంతో గాలిలోకి లేపాడు.

ఎంత బలంగా విసిరాడో గాని మాదక ద్రవ్యాలు తీసుకున్న ఫాస్ట్ బౌలర్ చేతి నుండి విసిరేయబడ్డ క్రికెట్ బంతిలా రివ్వుమని ఎగిరిపోయింది ఆ స్టీలు బిందె. బుచ్చిబాబు వేసుకున్న స్కెచ్ ప్రకారం అది సరిగ్గా బుల్బును తగలాలి. కాని ఎందుకోగాని అది గురితప్పి దూరంగా వున్న ఓ షెల్ఫ్‌ను తగలగా–ఆ షెల్ఫ్‌లోని కొన్ని సామాన్లు ఒకొక్కటీ కిందపడిపోతున్నాయి.

అది గమనించిన బుచ్చిబాబు గుండె పగిలిపోయినంతగా విలవిల్లాడిపోయాడు. అసహనంగా పళ్ళుపటపటమని కొరుకుతూ రెండు కళ్ళనూ గట్టిగా అదిమిమూసుకున్నాడు. ఆ షెల్ఫులోని స్టీలు సామాను ఇంకా పడుతూనే వున్నాయి.

తన స్కెచ్ మిస్సయింది. ఇక వాళ్ళ చేతుల్లో తన ప్రాణం పోతుంది.

వెంటనే ఎలర్ట్ అయిన వాళ్ళు తక్షణమే టిగ్గర్లను నొక్కే చివరిక్షణంలో వున్నట్టుండి భూమి బద్దలయినట్టు పెద్ద శబ్దం... బుచ్చిబాబు బిందెను విసిరేసిన చోటనే ఈ ప్రేలుడు సంభవించింది. ఆ శబ్దం తీవ్రతకు ఏకంగా గోడౌనే కొన్ని క్షణాలు పాటు వైబ్రేషన్‌కు గురయింది. వెంటనే ఆరిపోయిందా బల్బు.

ఆ చీకట్లో ప్రేలుడు సంభవించిన చోట ఎగిరిపడ్డ స్టీలు సామాన్లు ఎక్కడెక్కడో ఎగిరిపోయి ఏ గోడలకో తగిలి కిందపడుతున్న శబ్దాలు వినిపిస్తున్నాయ్.

ఆ చీకట్లో ఏం జరిగిందో అర్థం కాని ధనుష్ కొన్ని క్షణాల స్థబ్దుగా నిలుచున్నాడు. ఆ తర్వాత ఏదో అర్థమయి "రేయ్... ఆ టైగర్ గాడు ఇక్కడంతా మందుపాతరలు అమర్చాడు. పారిపోండి... పారిపోండి" విహ్వలంగా కేకలు పెట్టాడు. అంతే మరో క్షణంలో ఎక్కడ ఏది పేలుతుందోనని భయంగా అరుస్తూ వాళ్ళంతా బయటికి పరుగెత్తారు.

వెంటనే బుచ్చిడాడు తన సెల్ లైటింగ్‌తో ముగ్గరమ్మాయిలను వెతుకుతుండగా కిందపడిపోయిన ఆ ముగ్గురూ లేచి నిల్చున్నారు.

"ఎవరికీ ఏం కాలేదుగా" ఆత్రంగా బుచ్చిబాబు అడగ్గా–"లేదు... త్వరగా వెళదాం పద" తొందరపెట్టింది అవంతి.

"ఇక టెన్షన్ అవసరం లేదు. వాళ్ళు చచ్చినా ఇటువైపు రారు" అంటూ కింద పడివున్న తన బైకును నిలబెట్టాడు బుచ్చిబాబు.

బయటికి తోసుకుంటూ వచ్చి స్టార్ట్ చేసి "ఈ బాంబు పేలిన శబ్దం విని ఎవరయినా ఇక్కడికొచ్చి గమనిస్తారు. కమాన్... క్విక్ వచ్చి కూర్చోమన్నట్టు తలూపాడు బుచ్చిబాబు.

ముగ్గురూ ఎలా కూర్చోవాలో తెలియక ఇబ్బందిగా చూస్తూ బుచ్చిబాబు వెనుక అవంతిని కూర్చోబెట్టి, తర్వాత మరీ కష్టంగా ఆ ఇద్దరూ కూర్చున్నారు.

పాతిక తిండికి ముప్పాతిక చాకిరీ చేస్తూ అయిష్టంగా దున్నుతూ ఏడుస్తున్న ఎద్దులా కదిలిపోతోందా బైకు మరీ ఇబ్బందిగా.

"అసలు లోపలేం జరిగింది ? వున్నటుండి ఎక్కడో పేలుడు ఎలా సంభవించింది ?" అడిగింది అవంతి పరిస్థితేంటో అర్థం కాక.

బుచ్చిబాబు చిన్నగా నవ్వుతూ "మనం ఓ స్క్రిప్ట రాసుకుంటే, దేవుడు ఇంకో స్క్రిప్ట రాసుంటాడన్నట్టు... నేను బిందెను పైకి విసిరి బల్బును పగలగొట్టాలనుకున్నాను. కాని అది గురితప్పి ఎక్కడో వున్న షెల్ఫ్‌ను తగిలి, ఆ షెల్ఫ్‌లో ఎవరో దాపెట్టుకున్న బాంబు ఒకటి కిందపడి పేలింది.

ఆ ధనుష్‌కు ఈ విషయం తెలియక టైగర్ ఇక్కడంతా మందుపాతరలు అరేంజ్ చేశాడని భ్రమించి భయపడిపోయాడు. సినిమా కథ ఎన్ని మలుపులు ఎలా తిరిగినా చివరికి హీరోనే గెలుస్తాడన్నట్టు... ఫైనల్‌గా నేననుకున్న అంచనా మరోలా ఫలించింది" బదులిచ్చాడు.

మాన ప్రాణాలు దక్కినందుకు ఎంతో సంబరిపడిపోతూ దారి పొడవునా చరిత, మోక్షలు బుచ్చిబాబును క్షణం విరామం లేకుండా తెగ పొగిడేస్తున్నారు.

"అవునూ... ఈ వయసులో ఆడపిల్లలు హాయిగా ఉద్యోగాలు చేసుకుంటూ రేపోమాపో పెళ్ళిళ్ళు చేసుకోవాలి తప్ప మీ కెందుకు ఈ డ్రగ్స్ మిస్టరీలు?" అనుమానం వచ్చి అడిగాడు బుచ్చిబాబు.

చివర్న కూర్చున్న మోక్ష వెంటనే స్పందిస్తూ “ఇలా సమస్యల్లో పడి చావాలని మాకు ఎంతమాత్రం లేదు. ఇలాంటి తిప్పలన్నీ ఈ అవంతికే. ఏదో ఇంట్రెస్టింగా వుంటుందని బుద్ధి తక్కువయి దీనితో వచ్చాం” అంది.

అవంతికి కోపం వచ్చింది. “మహా తల్లులూ ఇక ఆపుతారా ! మీకై మీరు వస్తామంటే రమ్మన్నాను గాని, నాకు తోడుగా రమ్మని చెప్పానా?” రొప్పుతూనే వెంటనే మరో ఆలోచనలో నిమగ్నమైపోయింది.

బుచ్చిబాబు... ఎవడు వీడు ? ఏదో సినీ హీరో అవ్వాలని తిక్కతిక్కగా పైకలా మాట్లాడుతున్నాడు గాని, లోపలున్న శక్తి సామర్థ్యాలు అంత తేలికైనవి కావు. అంతమంది చుట్టుకుంటే వాళ్ళను మాటల్లో పడేసి స్టీలు బిందెను రహస్యంగా కాలుతో విసిరి బల్బును పగలగొట్టాలన్న సమయస్ఫూర్తి ఎలా వచ్చిందో అనుకుంటేనే ఆశ్చర్యమేస్తోంది.

తాను సాధించవలసిన ఆశయ సిద్ధికి ఇతగాడి సహాయం తప్పనిసరిగా అవసరమవుతుంది. డబ్బు ఎరతో ఇతగాడ్ని తప్పక వాడుకోవాలి !

సిటీ దాదాపు దగ్గర పడుతుండటంతో బుచ్చిబాబుకు విసుగు వచ్చేసింది. అన్నీ మాట్లాడుతున్నారు గాని తన పేమెంట్ ఎపుడు, ఎక్కడ ఇస్తారని ఇప్పటికీ చెప్పడం లేదు వాళ్ళు.

“ఇంతకి నా పేమెంట్?” అంటూ గుర్తు చేశాడు బుచ్చిబాబు.

“రేపు నేనే వచ్చి కలుస్తాను. డబ్బు ఇచ్చాక నీతో చాలా మాట్లాడే పనుంది” చెప్పింది అవంతి.

సిటీ ఎంటరవగానే ముగ్గురూ దిగేశారు.

బుచ్చిబాబు సెల్ నెంబరు తీసుకొని ఆమె విజిటింగ్ కార్డు అతనికిచ్చింది అవంతి.

“ఇక్కడి నుండి మేము ఆటోలో వెళతాం” అని అవంతి అనగానే సరేనని తలూపాడు బుచ్చిబాబు

*    *    *    *

“ఒరే దరిద్రుడా ! బంగారంటి బైకును రూపు నాశనం చేశావు గదర !

అయినా నువు దేన్ని ఢీ కొట్టావో అర్థం కావటం లేదు. నీకు చూస్తే చిన్న గాయం కూడా లేదు. కాని బైకు మాత్రం నాశనమయింది. ఎలా జరిగింది రా ఇదంతా?” నిప్పులు చెరిగాడు శ్రీను.

ఈ మాటలు ఎంతమాత్రం వినపడటం లేదు బుచ్చిబాబుకు. అతడు ఇంకేదో ఆలోచిస్తూ నవ్వుకుంటున్నాడు.

అయినా నేను పరిచయం అయిన పదినిముషాల్లోనే ఆ ముగ్గురమ్మాయిలూ ఏకంగా ‘బుచ్చిబాబూ’ అని ఏకవచనం సంబోధించారేంటి? కారణం ఏమయుంటుంది?

కారణమంటూ ఏమీ లేదు. ఈ బుచ్చిబాబును తొలిసారి ఎవరు చూసినా అలా కలుపుకోవాలనిపిస్తుంది. స్టారు... సూపర్ స్టారు. ఆ కళ వుండబట్టే అందరూ నన్ను ఇలా దగ్గర వాడిలా చూస్తారు.

తన భుజాన్ని తనే తట్టుకుంటూ శెభాష్ అనుకుంటూ నవ్వుకుంటూ మురిసిపోతున్న బుచ్చిబాబును చూసిన శ్రీనుకు మరింత మండిపోయింది.

"ఒరేయ్ పిచ్చోడా ! నేనిక్కడ నా గోడు చెప్పుకుంటుంటే అసలేం పట్టించుకోకుండా నీ కొద్ది నువ్వే కలలు కంటూ నవ్వుతున్నావా ?" గట్టిగా వీపును తట్టాడు శ్రీను.

విసుగ్గా చూసిన బుచ్చిబాబు "ఏమిట్రా నీ గోడు ?" అడిగాడు.

"ఎపుడో ఎలిమెంటరీ స్కూల్లో ఫ్రెండువని, ఏదో బ్రతుకుదెరువు కోసం వచ్చావని ఆశ్రయమిచ్చాను. ఎక్కడయినా పని చూసుకోకుండా ఈ సినిమా పిచ్చేంట్రా ? ఇపుడు నా బైకును రిపేరు చేయించాలంటే ఎంత కాదన్నా ఐదారు వేలవుద్ది. ఎవ్వడిస్తాడురా ?"

"ఒరేయ్ శ్రీను. సమర్థుడు చెత్తలోనూ అద్భుతాలు సృష్టిస్తాడు. అసమర్థుడు చేతిలో వున్న అద్భుతాన్ని చెత్తపాలు చేసుకుంటాడు. ఎప్పటికీ ఈ బుచ్చిబాబు మొదటి రకమే అన్న మాట గుర్తుంచుకో ! ఎప్పటికయినా అనుకున్నది సాధించి తీరుతాను."

శ్రీనుకు మండిపోయింది బుచ్చిబాబు మాటతీరు చూసి. "ఒరేయ్ ఏమిట్రా నీ పిచ్చిమాటలు నిప్పులు చెరిగాడు వెంటనే.

"శాస్త్రవేత్త పరిశోధన చేస్తున్నంతవరకూ నాలాగే ఓ పిచ్చోడిలా కనిపిస్తాడు. అనుకున్నది సాధించి చూపించాక దేవుడవుతాడందరికీ. ఈ బుచ్చిబాబు తీరుకూడా అంతే !

ఇపుడు నీ బైకు రిపేరవ్వాలంతేగా ! రేపు ఓ పదివేలిస్తాను తీస్కో."

బుచ్చిబాబు మాటలు విన్న శ్రీను వెనుకనుండి ఎవరో బలంగా గుద్దినట్టు ఒక్కసారి అదిరిపడ్డాడు. భ్రాంతి నుండి తేరుకోలేక అలాగే చూస్తుండిపోయాడు.

"షాకయింది చాలు గాని వచ్చి భోజనం వడ్డించు" చాపమీద కూర్చుంటూ చాలా సింపుల్‌గా బుచ్చిబాబు అన్నాక అతనికి ఎదురుగా వచ్చి కూర్చుని "పది... పదివేలంటున్నావ్. ఏమిట్రా నీమాటలు ?" ప్రశ్నించాడు శ్రీను నమ్మలేక.

"అవున్రా. నేను చెప్పింది నిజం. అక్షరాలా పదివేలు రేపు నీకిస్తున్నాను. అంత నమ్మకం లేకుంటే నిజమో కాదో తేల్చుకునేందుకు రేపటి వరకూ వెయిట్ చెయ్" బదులిచ్చాడు బుచ్చిబాబు అదే ధీమాతో.

పదివేలు ఇవ్వటమా ? సరిగ్గా ఓ టీ తాగాలన్నా నా దగ్గర పీడించుకొని పదిరూపాయలు తీసుకునేవాడు... ఎలా ఇస్తాడబ్బా ?

శ్రీను మనసులో అనుకుంటుండగా–

"అవున్రా. టీ కోసం పదిరూపాయలు అడుక్కున్న బుచ్చిబాబే ఈ మాటలు అంటున్నది. ఈ సమర్థుడు అద్భుతాలు సృష్టించే టైం మొదలయింది. మొదట్లో అలాగే ఆశ్చర్యంగా వుంటుంది మరి !"

ఇపుడు మరోసారి ఉలిక్కిపడ్డాడు శ్రీను – తన మనసులో మాటను ఎలా కనుక్కున్నాడో అర్థం కాక.

శ్రీను భుజం మీద చెయ్యివేసి "ఒరేయ్. ఈ బుచ్చిబాబు ఎన్నెన్నో ఘనకార్యాలు సాధిస్తాడని మొండిగా ఫిక్సయిపో ! లేకుంటే ఈ ఉలికిపాట్లు భరించలేక గుండె ఆగి ఛస్తావ్." సలహా ఇచ్చాడు బుచ్చిబాబు.

బుచ్చిబాబు ఊకదంపుడు మాటల్ను తరచూ వింటూ విసిగిపోయాడు శ్రీను. కాని ఇపుడు అతగాడి స్వరంలో ముందెన్నడూ లేని వైవిధ్యం ధ్వనిస్తున్నది.

"రేయ్ బుచ్చీ. నీకు నేను ఫ్రెండును. అడిగిన దానికి మాత్రమే సమాధానం చెప్పు. అంత డబ్బు ఎలా వస్తుంది?" లాలనగా అడిగాడీసారి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Tiger**

* * *